## క్లుప్తంగా

### చంద్రప్రభ వాహనంపై కాశీ విశ్వనాథుడు



నెల్లూరు(బృందావనం): ఉస్మాన్‌సాహెబ్‌పేటలోని అన్నపూర్ణ విశాలాక్షి సమేత కాశీ విశ్వనాథస్వామి దేవస్థాన బ్రహ్మోత్సవాల్లో చంద్రప్రభ వాహనంపై స్వామివారు మంగళవారం దర్శనమిచ్చారు. ఉభయకర్తలుగా కృష్ణారెడ్డి, రామలక్ష్మమ్మ దంపతులు వ్యవహరించారు. ఈఓ దర్గయ్య, ధర్మకర్తల మండలి చైర్మన్ వెంకటరమణకుమార్, తదితరులు పర్యవేక్షించారు.

### ఉద్యోగావకాశాలు కల్పించరూ..

నెల్లూరు(దర్గామిట్ట): డీఎస్సీ – 1998 క్వాలిఫైడ్స్‌లో మిగిలిపోయిన అభ్యర్థులకు ఉద్యోగావకాశాలను కల్పించాలంటూ కలెక్టరేట్ ఎదుట ధర్నాను మంగళవారం చేపట్టారు. అనంతరం వినతిపత్రాన్ని అందజేశారు.

### నాడు - నేడు పనులు పూర్తి చేయాలి

కొడవలూరు : మండలంలో జరుగుతున్న నాడు–నేడు పనులను జూన్ 10వ తేదీ నాటికి పూర్తి చేయాలని ట్రెయినీ కలెక్టర్ జి.విద్యాధరి ఆదేశించారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలోని సమావేశ మందిరంలో నాడు–నేడు పనులు జరుగుతున్న 23 పాఠశాలల హెచ్‌ఎంలతో మంగళవారం ఆమె సమీక్షించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ మండలంలో నాడు–నేడు కింద 23 పాఠశాలలకు రూ.6.54 కోట్లు మంజూరు అయిందన్నారు. ఇప్పటికే తొలి విడతగా రూ.1.82 కోట్లు విడుదల చేశారని తెలిపారు. ఇందులో ఇప్పటివరకు రూ.1.12 కోట్లు ఖర్చు చేయగా, ఇంకా రూ.70 లక్షల నిధులు సిద్ధంగా ఉన్నాయన్నారు. సిమెంట్ కూడా అందుబాటులోకి వచ్చినందున త్వరగా పనులు పూర్తి చేసేందుకు హెచ్‌ఎంలు కృషి చేయాలని చెప్పారు. ప్రతిరోజూ జరుగుతున్న ప్రోగ్రెస్‌ను ఎప్పటికప్పుడు యాప్‌లో అప్‌లోడ్ చేయాలన్నారు. పాఠశాలలు పునఃప్రారంభ సమయానికి విద్యార్థులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా పనులు పూర్తి చేసి వినియోగంలోకి తేవాలని సూచించారు. తొలుత ఆమె గండవరం, కొడవలూరు, టపాతోపు పాఠశాలల్లో జరుగుతున్న నాడు–నేడు పనులను పరిశీలించారు. ఈ సమావేశంలో ఎంపీడీఓ పి.సుబ్రహ్మణ్యం, ఎంఈఓ జి.వసంతకుమారి, సీఆర్పీలు వీరాంజనేయులు, జె.పెంచలరావు, ఎం.దయాకర్ తదితరులు పాల్గొన్నారు.

### సొసైటీ కార్యాలయంలో డీసీఓ తనిఖీలు

కొడవలూరు : మండలంలోని యల్లాయపాళెం సహకార సంఘ కార్యాలయాన్ని జిల్లా సహకారాధికారిని బి.సుధాభారతి మంగళవారం తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఎరువుల నిల్వలు, రికార్డుల నిర్వహణను పరిశీలించారు. అనంతరం స్థానిక సచివాలయాన్ని సందర్శించి ప్రజలకు అందిస్తున్న సేవల గురించి అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా డీసీఓ మాట్లాడుతూ రైతులకు సహకార సంఘాలు అండగా నిలవాల్సిన అవసరం ఉందన్నారు. సకాలంలో ఎరువులు అందించడంతో పాటు అవసరాలకు రుణ సదుపాయం కల్పించి ఆసరాగా నిలవాలని సూచించారు. ఆమె వెంట ఎస్డీఎల్‌సీఓ ఎంవీ సుభాషిణి, కోవూరు సీనియర్ ఇన్‌స్పెక్టర్ పి.శివకుమార్, విజయ డెయిరీ డైరెక్టర్ ఇసనాక సునీల్‌రెడ్డి తదితరులు ఉన్నారు.

### ఆటోను ఢీకొన్న బైక్

బుచ్చిరెడ్డిపాళెం : ఆటోను బైక్ ఢీకొన్న ప్రమాదంలో వ్యక్తికి తీవ్రగాయాలైన ఘటన మండలంలోని పెనుబల్లి శివారులోని రైస్‌మిల్లు సమీపంలో మలుపు వద్ద మంగళవారం చోటుచేసుకుంది. స్థానికుల కథనం మేరకు.. బుచ్చిరెడ్డిపాళెం నుంచి పెనుబల్లి వైపు ఆటోలో కంకరను తీసుకెళ్తుండగా నెల్లూరు నుంచి బుచ్చిరెడ్డిపాళెం వస్తున్న ద్విచక్ర వాహనదారుడు అతివేగంగా రాంగ్‌రూట్లో వెళ్లి ఆటోను ఢీకొని రోడ్డుపై పడ్డాడు. దీంతో ద్విచక్ర వాహనదారుడి తలకు బలమైన గాయాలయ్యాయి. అదే సమయంలో జొన్నవాడలో విధులు ముగించుకుని స్టేషన్‌కు వెళ్తున్న ఎస్సై వీరప్రతాప్ ఘటనా స్థలానికి చేరుకుని గాయపడిన వ్యక్తిని మరో ఆటోలో నెల్లూరు ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు. క్షతగాత్రుడి వివరాలు తెలియరాలేదని ఎస్సై తెలిపారు.

### ఆటో బోల్తా

వెంకటాచలం : ఆటో బోల్తా పడి ఇద్దరు గాయపడిన ఘటన మండలంలోని గొలగమూడి సమీపంలో మంగళవారం జరిగింది. నెల్లూరు నగరానికి చెందిన వెంకటేశ్వర్లు, ప్రసాద్‌రావు పనినిమిత్తం ఆటోలో గొలగమూడికి వచ్చారు. తిరిగి ఆటోలో నెల్లూరుకు వెళ్తుండగా సర్వేపల్లి కాలువ మలుపురోడ్డు వద్ద ఆటో అదుపుతప్పి బోల్తా పడింది. ఈ ప్రమాదంలో ఆటోలో ప్రయాణిస్తున్న వెంకటేశ్వర్లు, ప్రసాద్‌రావులకు గాయాలవడంతో వారిని చికిత్స నిమిత్తం జిల్లా ప్రభుత్వాస్పత్రికి తరలించారు.

# ఉపాధి పనుల్లో ముందుండాలి

• కలెక్టర్ హరినారాయణన్

నెల్లూరు(దర్గామిట్ట): జాతీయ ఉపాధి హామీ పనుల్లో జిల్లాను ముందంజలో నిలపడానికి డ్వామా అధికారులు ప్రత్యేక దృష్టి సారించాలని కలెక్టర్ హరినారాయణన్ పేర్కొన్నారు. ఉపాధి హామి పథక అమలు తీరుపై కలెక్టరేట్లో మంగళవారం నిర్వహించిన ప్రత్యేక సమీక్షలో ఆయన మాట్లాడారు. ఉపాధి పథకం ద్వారా మంచి ఫలితాలను సాధించేందుకు గానూ ప్రత్యేక ప్రణాళికతో ముందుకెళ్లాలని కోరారు. ఉపాధి కూలీలందరికీ పని కల్పించేలా చర్యలు చేపట్టాలని సూచించారు. పని దినాలు పెరగడంతో పాటు ఎక్కువ కూలి వచ్చేలా చూడాలని, సిబ్బంది పనితీరుపై నిరంతర పర్యవేక్షణ ఉండాలని తెలిపారు. సాగునీటి పనులకు సంబంధించిన ఫీల్డ్ ఛానల్స్‌కు ప్రాధాన్యమివ్వాలని సూచించారు. ఉద్యాన, పండ్ల మొక్కలు వేయాలని.. నాటిన ప్రతి మొక్కనూ సంరక్షించాలన్నారు. ప్రతి 15 రోజులకోసారి సమీక్ష ఉంటుందని, అధికారులు పూర్తి సమాచారంతో హాజరు కావాలని ఆదేశించారు. డ్వామా పీడీ వెంకట్రావు, అడిషనల్ పీడీ నిర్మల, తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న హరినారాయణన్



హాజరైన అధికారులు

**పారదర్శకంగా రీ సర్వే**

ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్న రీ సర్వే ప్రక్రియను పారదర్శకంగా, త్వరితగతిన పూర్తి చేయాలని కలెక్టర్ హరినారాయణన్ పేర్కొన్నారు. జిల్లాలోని ఆర్డీఓలు, తహసీల్దార్లతో వీడియో కాన్ఫరెన్స్‌ను తన చాంబర్ నుంచి నిర్వహించిన ఆయన మాట్లాడారు. రెవెన్యూ సమస్యలపై వచ్చే దరఖాస్తులను పరిశీలించి నిర్ణీత గడువులోపు పరిష్కరించాలని సూచించారు. రెవెన్యూ సమస్యల పరిష్కారానికి వచ్చే ప్రజలకు సత్వర న్యాయం జరిగేలా అధికారులు శ్రద్ధ వహించాలన్నారు. రీ సర్వేకు సంబంధించి రాళ్ల నాటే ప్రక్రియను నిర్దేశించిన గడువులోపు పూర్తి చేయాలని తెలిపారు. జేసీ కూర్మనాథ్, కందుకూరు సబ్ కలెక్టర్ శోభిక, డీఆర్వో వెంకటనారాయణమ్మ, కావలి, ఆత్మకూరు ఆర్డీఓలు శీనానాయక్, కరుణకుమారి, సర్వే ల్యాండ్ రికార్డ్స్ ఏడీ హనుమాన్ ప్రసాద్, తదితరులు పాల్గొన్నారు.

## యూజర్ చార్జీలను తప్పక చెల్లించాలి

నెల్లూరు(బారకాసు): క్లీన్ ఆంధ్రప్రదేశ్ కార్యక్రమంలో భాగంగా నగరపాలక సంస్థ నిర్వహిస్తున్న ఇంటింటి చెత్త సేకరణ యూజర్ చార్జీలను క్రమం తప్పకుండా చెల్లించాలని కమిషనర్ వికాస్ మర్మత్ పేర్కొన్నారు. 29వ డివిజన్లోని గాంధీనగర్ పార్కులో గల శానిటేషన్ మస్టర్ పాయింట్‌ను మంగళవారం తనిఖీ చేశారు. అనంతరం 22వ డివిజన్ స్నేహానగర్ సచివాలయంలో శానిటేషన్ మస్టర్ పాయింట్‌ను సందర్శించి అక్కడి సిబ్బందికి పలు సూచనలు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. చెత్త సేకరణ యూజర్ చార్జీలను రూ.90 నుంచి రూ.40కు తగ్గించిన క్రమంలో ప్రతి ఒక్కరూ బాధ్యతగా చెల్లించాలని కోరారు. బహిరంగ స్థలాలు, రోడ్లపై గేదెలను కట్టి పరిసరాలను అపరిశుభ్రంగా ఉంచరాదని యజమానులకు సూచించారు. నిర్లక్ష్యంగా వ్యవహరించే వారికి నోటీసులను జారీ చేసి జరిమానాలను విధిస్తామని స్పష్టం చేశారు.

**రుణాలపై అవగాహన కల్పించండి**

టిడ్కో గృహాల లబ్ధిదారులు స్వయంగా గృహ రుణాలను పొందేలా అవగాహన కల్పించాలని కమిషనర్ ఆదేశించారు. నగరపాలక సంస్థ కార్యాలయంలోని తన చాంబర్లో మెప్మా అధికారులు, తదితరులతో నిర్వహించిన సమీక్ష సమావేశంలో ఆయన మాట్లాడారు. రుణాల మంజూరు ప్రక్రియకు గానూ ప్రత్యేక మేళాలను నిర్వహించాలని సూచించారు.



రోడ్డు పక్కన చెత్తను పరిశీలిస్తున్న వికాస్ మర్మత్

**కార్పొరేషన్ అధికారులతో వీడియో కాన్ఫరెన్స్**

కమిషనర్‌తో పాటు అన్ని విభాగాల అధికారులతో వీడియో కాన్ఫరెన్స్‌ను కమిషనర్ అండ్ డైరెక్టర్ ఆఫ్ మున్సిపల్ అడ్మినిస్ట్రేషన్ కోటేశ్వరరావు నిర్వహించారు. వేసవిలో తాగునీటి సరఫరా, జగనన్న శాశ్వత భూ హక్కు పథకం, రీసర్వే విధానం, తదితర అంశాలపై పలు సూచనలు చేశారు. ఎస్ఈ సంపత్‌కుమార్, ఈఈ సంజయ్, ఎంహెచ్ఓ వెంకటరమణ, తదితరులు పాల్గొన్నారు.

## హంసవాహనంపై నృసింహుడు



నెల్లూరు రూరల్: నరసింహకొండపై వెలసిన వేదగిరి లక్ష్మీనరసింహస్వామి దేవస్థాన వార్షిక బ్రహ్మోత్సవాల్లో భాగంగా పలు విశేష పూజలను భక్తిశ్రద్ధలతో మంగళవారం నిర్వహించారు. చప్పరోత్సవం, హంసవాహనసేవను ఆలయ అర్చకులు శాస్త్రోక్తంగా జరిపారు. స్వామి, ఆదిలక్ష్మి అమ్మవారిని ప్రత్యేకంగా అలంకరించారు. పలు సాంస్కృతిక కార్యక్రమాలను ప్రదర్శించారు. ఆలయ చైర్మన్ సురేంద్రరెడ్డి, ఈఓ గిరికృష్ణ పర్యవేక్షించారు.

## వీధి కుక్కల నియంత్రణకు చర్యలు

నెల్లూరు(బారకాసు): జనావాసాల మధ్య తిరుగుతూ ప్రమాదకరంగా మారిన వీధి కుక్కల నియంత్రణకు తక్షణమే చర్యలు చేపట్టాలని మేయర్ స్రవంతి ఆదేశించారు. నగరపాలక సంస్థ కార్యాలయంలోని తన చాంబర్లో మంగళవారం నిర్వహించిన ప్రత్యేక సమీక్ష సమావేశంలో ఆమె మాట్లాడారు. నగరంలో సోమవారం పట్టపగలు దాదాపు 40 మందికిపైగా పిచ్చికుక్క కాటుకు గురవడం బాధాకరమన్నారు. పిచ్చి కుక్కలు ఎక్కడెక్కడున్నాయో గుర్తించాలని అధికారులకు సూచించారు. ఎంహెచ్ఓ వెంకటరమణ, వెటర్నరీ వైద్యుడు మదన్‌మోహన్, తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న స్రవంతి

## వేడుకగా స్వయంవర పార్వతీ హోమం

నెల్లూరు(బృందావనం): నగరంలోని కస్తూరిదేవి గార్డెన్స్‌లో పార్వతీ స్వయంవర హోమాన్ని యాదవ భవన్ ట్రస్ట్, యాదవ ప్రముఖుల ఆధ్వర్యంలో మంగళవారం నిర్వహించారు. కంచికామకోటి పీఠాధిపతి శంకర విజయేంద్ర సరస్వతి హాజరై గోపూజ, జ్యోతి ప్రజ్వలన, కలశారాధన, హోమ, పూజాది కార్యక్రమాలను జరిపారు. అనంతరం అనుగ్రహభాషణ చేశారు. దేశంలో గో సంతతిని అభివృద్ధి చేస్తూ.. పాడి, వ్యవసాయాభివృద్ధికి యాదవులు చేస్తున్న కృషి ఎనలేనిదన్నారు. బీద రవిచంద్ర, సుధాకర్, రాధయ్య, దేవరాల సుబ్రహ్మణ్యం, యాదవ భవన్ ట్రస్ట్ చైర్మన్, మేనేజింగ్ ట్రస్టీ నాగకిషోర్‌యాదవ్ దంపతులు, తదితరులు పాల్గొన్నారు.



## మూలస్థానేశ్వరాలయంలో విశేష పూజలు



నెల్లూరు(బృందావనం): వసంతోత్సవాల్లో భాగంగా మూలాపేటలోని భువనేశ్వరి సమేత మూలస్థానేశ్వరస్వామి దేవస్థానంలో మధుకైటభవధ అలంకారాన్ని వేడుకగా మంగళవారం నిర్వహించారు. స్వామివార్లకు అభిషేకాలు, అర్చనలు, తదితర పూజలు చేశారు. ఉభయకర్తగా వెంకటసుబ్రహ్మణ్యం వ్యవహరించారు.

## ఆదిశంకరాచార్యులు కృషి అనన్యసామాన్యం

నెల్లూరు(బృందావనం): సనాతన ధర్మ పరిరక్షణకు జగద్గురు ఆదిశంకరాచార్యుల ఎంతో కృషి చేశారని ఏర్పేడు పీఠపాలిత దత్తాత్రేయ ఆశ్రమాధిపతి అనంతానంతగిరిమాత ప్రవచించారు. సండే మార్కెట్ సమీపంలోని చక్రాల వారి ట్రస్ట్ ఆదిశంకర ధ్యాన మందిరంలో నిర్వహిస్తున్న ఆదిశంకరాచార్యులు సంస్మరణోత్సవాలకు మంగళవారం హాజరయ్యారు. అనంతరం అనంతానంతగిరిమాత, ఆంజనేయవరప్రసాద్‌రావును సత్కరించారు. విశ్రాంత అధ్యాపకుడు వెంకటేశ్వరరావు, శ్రీనివాసులు, సాయిపవన్, ప్రభాకర్‌శర్మ, ఛాయాదేవి, ప్రసాద్, లక్ష్మీనరసింహారావు, చక్రాల వారి ట్రస్ట్ మేనేజింగ్ ట్రస్టీ ఆనంద్‌కుమార్, ట్రస్టీ వెంకటలక్ష్మీనరసింహం, వెంకటశ్రీకాంత్‌శర్మ, తదితరులు పాల్గొన్నారు.



## అంగన్‌వాడీ హెల్పర్ పోస్టుల భర్తీకి నోటిఫికేషన్

నెల్లూరు(వేదాయపాళెం): నెల్లూరు అర్బన్ పరిధిలో 12 అంగన్‌వాడీ హెల్పర్ పోస్టుల భర్తీకి దరఖాస్తులను ఆహ్వానిస్తున్నామని నెల్లూరు అర్బన్ సీడీపీఓ అన్నపూర్ణ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. యనమలవారిదిన్నె (ఎస్సీ), చాముండివారితోట, నీలగిరిసంఘం - 1, ఈద్గామిట్ట, బారాషహీద్ దర్గా - 2 (ఓసీ), వెంగళరావునగర్ - 3 (బీసీ - డీ), లక్కీబోర్డు సెంటర్ (పీహెచ్‌సీ - ఓహెచ్), ఖుద్దూస్‌నగర్ (బీసీ - బీ), పొట్టేపాళెం - 1, ఆమంచర్ల - 2 (ఎస్సీ), కొత్తూరు - 4 (ఓసీ), జెండావీధి (బీసీ - ఈ) కేంద్రాల్లో హెల్పర్ల పోస్టుల భర్తీకి రోస్టర్‌లో రిజర్వేషన్‌ను కేటాయించామని చెప్పారు. ఆసక్తి గల వారు ఆయా వార్డు, గ్రామ సచివాలయాల్లో నిర్దేశిత గడువులోపు దరఖాస్తు చేసుకోవాలని కోరారు.

## క్రైమ్ కార్నర్

## బంగారంతో ఉడాయింపు

నెల్లూరు(క్రైమ్): ఆభరణాల తయారీకి ఇచ్చిన బంగారంతో తయారీదారుడు పరారైన ఘటన ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. పోలీసుల సమాచారం మేరకు.. సంతపేటలోని ఆంజనేయస్వామి గుడి సమీపంలో నివాసం ఉంటున్న అశోక్‌కుమార్ ఆనం వారి వీధిలోని లలితా జ్యువెలరీ మార్ట్‌లో అకౌంటెంట్‌గా పనిచేస్తున్నారు. ఈద్గామిట్టకు చెందిన కరిముల్లాకు పదేళ్లుగా ముడి బంగారాన్ని ఇచ్చి బంగారు ఆభరణాలను తయారు చేయించి తీసుకెళ్లేవారు. కరిముల్లా సైతం ఎంతో నమ్మకంగా ఉంటూ చెప్పిన సమయానికే ఆభరణాలను తయారుచేసిచ్చేవారు. ఈ క్రమంలో ఆభరణాల తయారీకి గానూ 990.12 గ్రాముల ముడి బంగారాన్ని కరిముల్లాకు అశోక్‌కుమార్ మార్చి 26న ఇచ్చారు. 55 గ్రాముల ఆభరణాలను తయారు చేసి మార్చ్‌లో కరిముల్లా ఇచ్చారు. మిగిలిన ఆభరణాలను త్వరలోనే ఇస్తానని నమ్మబలికారు. అయితే రోజులు గడుస్తున్నా ఇవ్వకపోవడంతో అశోక్ ప్రశ్నించగా కాలయాపన చేస్తూ వచ్చారు. ఈ క్రమంలో రూ.46.75 లక్షల విలువజేసే 935 గ్రాముల బంగారుతో కరిముల్లా పరారయ్యారు. ఫోన్ స్విచ్ఛాఫ్ రావడంతో నిందితుడి ఇల్లు, దుకాణం వద్దకు గత నెల 25న అశోక్‌కుమార్ వెళ్లగా, రెండింటికి తాళం వేసి ఉంది. చుట్టుపక్కల ఆరా తీసినా ప్రయోజనం లేకపోవడంతో సంతపేట పోలీసులకు ఫిర్యాదు చేశారు. దీంతో నిందితుడిపై చీటింగ్ కేసును ఇన్‌స్పెక్టర్ కల్యాణ్‌రాజు నమోదు చేశారు.

## వాహనచోదకుడికి గాయాలు

నెల్లూరు(క్రైమ్): మోపెడ్ ఢీకొనడంతో వాహనచోదకుడు గాయపడిన ఘటన కొత్త పెన్నా బ్రిడ్జిపై మంగళవారం చోటుచేసుకుంది. వివరాలు.. నెల్లూరులో తన బంధువుల గృహ ప్రవేశ కార్యక్రమానికి హాజరయ్యేందుకు గానూ జలదంకి మండలం వేములపాడుకు చెందిన చిన్నయ్య బైక్‌పై బయల్దేరారు. కొత్త పెన్నా బ్రిడ్జిపైకి వచ్చేసరికి వెనుకవైపు నుంచి వస్తున్న టీవీఎస్ మోపెడ్ ఢీకొంది. బైక్ హ్యాండిల్‌కు తగలడంతో చిన్నయ్య కిందపడి గాయపడ్డారు. దీంతో క్షతగాత్రుడ్ని చికిత్స నిమిత్తం నగరంలోని ఓ హాస్పిటల్‌కు తరలించారు. బాధితుడి ఫిర్యాదు మేరకు నార్త్ ట్రాఫిక్ పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

## రైలు ప్రమాదాలపై ప్రయాణికులకు అవగాహన

నెల్లూరు(క్రైమ్): రైలు ప్రమాదాలపై ప్రయాణికులకు ఆర్పీఎఫ్ ఆధ్వర్యంలో మంగళవారం అవగాహన కల్పించారు. పట్టాలు దాటడం నేరమని, ఓవర్ బ్రిడ్జిలను వినియోగించాలని సూచించారు. నగరంలోని సౌత్ రైల్వేస్టేషన్లో నిర్వహించిన కార్యక్రమంలో ఆర్పీఎఫ్ సిబ్బంది జనార్దన్, కలామ్, సర్వేశ్వరరావు, పరశురామ్, తదితరులు పాల్గొన్నారు.

## రూరల్ మండల సర్వసభ్య సమావేశం నేడు

నెల్లూరు రూరల్: రూరల్ మండల సర్వసభ్య సమావేశాన్ని నగరంలోని నెల్లూరు రూరల్ ఎంపీడీఓ కార్యాలయ సమావేశ మందిరంలో బుధవారం నిర్వహించనున్నామని ఇన్‌చార్జి ఎంపీడీఓ శైలేంద్రకుమార్ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. పలు సమస్యలపై తీర్మానం చేయనున్నామని పేర్కొన్నారు. మండల స్థాయి అధికారులు, పంచాయతీ కార్యదర్శులు, సర్పంచ్‌లు ఎంపీటీసీలు హాజరుకావాలని కోరారు.

## నేడు విద్యుత్ ఉండని ప్రాంతాలు

నెల్లూరు(వీఆర్సీసెంటర్): నగరంలోని ఎంజీనగర్ సబ్‌స్టేషన్ పరిధిలో గల 11 కేవీ నీలగిరి సంఘం ఫీడర్‌లో నూతన టవర్లను ఏర్పాటు చేయనున్న నేపథ్యంలో పలు ప్రాంతాల్లో విద్యుత్ సరఫరా బుధవారం ఉండదని ఐఈ సెక్షన్ ఏఈ లక్ష్మీనారాయణ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. లక్ష్మీనరసింహపురం, రామాలయ వీధి, బారాషహీద్ దర్గా, ప్రగతినగర్, లేక్‌వ్యూ కాలనీ, సుజాతమ్మకాలనీ, తదితర ప్రాంతాల్లో ఉదయం ఎనిమిది నుంచి మధ్యాహ్నం 1.30 వరకు సరఫరా ఉండదని పేర్కొన్నారు.

## శంకరమఠంలో కంచికామకోటి పీఠాధిపతి



శంకర విజయేంద్ర సరస్వతికి స్వాగతం పలుకుతున్న భక్తులు



నవగ్రహాలకు పూజలు

నెల్లూరు(బృందావనం): జొన్నవాడలోని మల్లికార్జున సమేత కామాక్షితాయి ఆలయంలో నిర్వహిస్తున్న మహాకుంభాభిషేక మహోత్సవాలకు గానూ జిల్లాకు వచ్చిన కంచికామకోటి పీఠాధిపతి శంకర విజయేంద్ర సరస్వతి మూలాపేటలోని శంకరమఠానికి మంగళవారం విచ్చేశారు. మఠం నిర్వాహకులు నందకిషోర్, ఉషాకుమారి దంపతులు సాదరంగా ఆహ్వానించారు. మఠం ప్రాంగణంలోని కామాక్షి చంద్రమౌళీశ్వరాలయంలో కొలువైన కామాక్షి అమ్మవారు, చంద్రమౌళీశ్వరస్వామి, మల్లికార్జునస్వామి, సుబ్రహ్మణ్యేశ్వరస్వామి, నవగ్రహాలకు పూజలు చేశారు. అనంతరం భక్తులకు దర్శనభాగ్యం కల్పించారు. కంచికామకోటి పీఠాధిపతిని తమిళనాడు హైకోర్టు జడ్జి రాజా, ఆంధ్రప్రదేశ్ హైకోర్టు విశ్రాంత జడ్జి సీతాపతి దంపతులు దర్శించుకున్నారు. శంకరమఠంలో భిక్షను స్వీకరించిన అనంతరం కొద్దిసేపు సేదతీరి జొన్నవాడకు పయనమయ్యారు. బొందిలి సంఘ జిల్లా కార్యదర్శి నాగేంద్రసింగ్, తదితరులు పాల్గొన్నారు.

## ఆలయాల అభివృద్ధికి సమన్వయంతో సాగాలి



మాట్లాడుతున్న రామచంద్రరావు

నెల్లూరు(బృందావనం): జిల్లాలోని ఆలయాల పరిరక్షణతో పాటు అభివృద్ధికి ఈఓలు, ధర్మకర్తల మండలి సభ్యులు సమన్వయంతో ముందుకు సాగాలని రాష్ట్ర దేవాలయ పాలన సంస్థ డైరెక్టర్ రామచంద్రరావు పేర్కొన్నారు. జిల్లాలోని వివిధ దేవస్థానాల ధర్మకర్తల మండలి సభ్యులు, చైర్మన్లు, ఈఓలకు శిక్షణ కార్యక్రమాన్ని నగరంలోని రాజరాజేశ్వరి అమ్మవారి దేవస్థాన కల్యాణ మండపంలో మంగళవారం నిర్వహించారు. దేవదాయ శాఖ కమిషనర్ ఉత్తర్వుల మేరకు నిర్వహించిన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. భగవంతుడికి, భక్తుడికి ప్రథమ సేవకులనే విషయాన్ని పాలకమండలి సభ్యులు గుర్తించాలని కోరారు. ఆలయాల ఆస్తుల పరిరక్షణలో వీరి పాత్ర కీలకమన్నారు. దేవస్థానాల భూమికి సంబంధించిన కౌలు బకాయిల విషయంలో ఈఓలు, ధర్మకర్తల మండలి సభ్యులు సమన్వయంతో పనిచేయాలని సూచించారు. సూచనలు, సలహాలను కమిషనర్ దృష్టికి తీసుకెళ్తామని వివరించారు. జిల్లా దేవదాయ శాఖాధికారి కార్యాలయ సూపరింటెండెంట్ వెంకటరమణ, రాజరాజేశ్వరి అమ్మవారి దేవస్థాన ఈఓ వెంకటశ్రీనివాసులురెడ్డి, ధర్మకర్తల మండలి చైర్మన్లు శ్రీనివాసరావు, శివకుమార్ ఆచారి, తదితరులు పాల్గొన్నారు.

## ఉపాధ్యాయ నేత రామిరెడ్డికి నివాళి

నెల్లూరు (టౌన్): ఉపాధ్యాయ ఉద్యమ నేత దాచూరి రామిరెడ్డి ఏడో వర్ధంతి సభను నగరంలోని యూటీఎఫ్ జిల్లా కార్యాలయంలో మంగళవారం నిర్వహించారు. ఈ సందర్భంగా యూటీఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు వెంకటేశ్వర్లు మాట్లాడారు. ఉద్యమాల సందర్భంగా ఉపాధ్యాయులపై పెట్టిన కేసులను రాష్ట్ర ప్రభుత్వం ఉపసంహరించుకోవాలని కోరారు. రాష్ట్ర కార్యదర్శి నవకోటేశ్వరరావు, సీనియర్ నేతలు బాబురెడ్డి, శ్రీహరి, కొండాచారి, జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శి శేషు, చలపతిశర్మ, అచ్చయ్య, విజయకుమారి, తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న వెంకటేశ్వర్లు

## పొట్టేపాళెం సచివాలయంలో తనిఖీలు

నెల్లూరు రూరల్: పొట్టేపాళెంలోని సచివాలయాన్ని ఇన్‌చార్జి ఎంపీడీఓ శైలేంద్రకుమార్ ఆకస్మికంగా మంగళవారం తనిఖీ చేశారు. గ్రామంలో అక్రమ కట్టడాలపై ఫిర్యాదు అందటంతో వాటిని పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. ఆక్రమణలకు పాల్పడితే చర్యలు తప్పవని హెచ్చరించారు. సచివాలయ పరిధిలోని ప్రాంతాల్లో అర్హులకు ప్రభుత్వ పథకాలు అందేలా చూడాలని సూచించారు. ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ రమణారెడ్డి, పంచాయతీ కార్యదర్శి ముషీధర్, తదితరులు పాల్గొన్నారు.



## ఎస్పీని కలిసిన పోలీస్ అధికారుల సంఘ నేతలు

నెల్లూరు(క్రైమ్): ఎస్పీ తిరుమలేశ్వరరెడ్డిని నగరంలోని జిల్లా పోలీస్ కార్యాలయంలో ఏపీ పోలీస్ అధికారుల సంఘ రాష్ట్ర నేతలు మర్యాదపూర్వకంగా మంగళవారం కలిశారు. పుష్పగుచ్ఛాన్ని అందజేసి శుభాకాంక్షలను తెలియజేశారు. పోలీస్ అధికారుల సంఘ రాష్ట్ర అధ్యక్షుడు శ్రీనివాసరావు, గౌరవ సలహాదారుడు శ్రీహరి, ఉపాధ్యక్షుడు శేషయ్య, ఆర్గనైజింగ్ సెక్రటరీ గౌస్‌బాషా, కో ఆప్షన్ సభ్యులు నరసయ్య, అనూరాధ పాల్గొన్నారు.



## భక్తిశ్రద్ధలతో మహాకుంభాభిషేక మహోత్సవం

నెల్లూరు(బృందావనం): వేదాయపాళెంలోని త్యాగరాజస్వామి మందిరంలో మహాకుంభాభిషేకాలను భక్తిశ్రద్ధలతో నిర్వహిస్తున్నారు. జలాధివాసం, బింబోత్థాపన, కలశపూజలు, గ్రామోత్సవం, తదితర పూజా కార్యక్రమాలను ప్రతిష్టాపనాచార్యులు వెంకటసుబ్బయ్యశర్మ, భాస్కరశర్మ ఆధ్వర్యంలో జరిపారు. మహోత్సవాలు బుధవారంతో ముగియనున్నాయని మందిర ధర్మకర్త చైతన్యకుమార్, నాగదేవీప్రసాద్ తెలిపారు.

